క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

సాక్షి ఎఫెక్ట్



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో విద్యుత్ సిబ్బంది మరొకటి బిగించారు. మంగళవారం 'సాక్షి'లో 'ట్రాన్స్‌ఫార్మర్ బిగింపులో నిర్లక్ష్యం' పేరిట ప్రచురితమైన వార్తకు ట్రాన్స్‌కో ఏడీఈ రాజు స్పందించారు. మోకాపైకి వెళ్లి, ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. జాప్యానికి గల కారణాలను ఏఈ నరేశ్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాతపూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించేందుకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు



విద్యానగర్: బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) 70వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం కరీంనగర్‌లోని టవర్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేశ్, జిల్లా నాయకులు పసుల శ్రవణ్, నక్క అరుణ్, శివరామకృష్ణ, ఎండీ.సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ పీఆర్ డీఈకి సన్మానం



డీఈ నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచులు

కరీంనగర్‌రూరల్: బదిలీపై వెళ్తున్న పంచాయతీరాజ్ డీఈ నవీన్‌కుమార్‌ను మంగళవారం మాజీ సర్పంచులు ఘనంగా సన్మానించారు. డీఈగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జక్కం నర్సయ్య, ఉప్పుల శ్రీధర్, దబ్బెట రమణారెడ్డి, నాయకులు మారుతి, మల్లారెడ్డి, రాము, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు పరామర్శ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ ఎంపీడీవో ఆకుల సంజీవరావు తండ్రి సాంబయ్య ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యులను మంగళవారం ఓదెలలోని వారి నివాసంలో మాజీ సర్పంచులు పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం సాంబయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జక్కం నర్సయ్య, దబ్బెట రమణారెడ్డి, ఉప్పుల శ్రీధర్, రుద్ర రాము, మారుతి, రాజయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ మానేరుకు అవార్డు ప్రదానం



సప్తగిరికాలనీ: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ మానేరుకు మల్టిపుల్ బెస్ట్ మెంబర్‌షిప్ గ్రోత్ అవార్డు దక్కింది. మంగళవారం కరీంనగర్‌లో కౌన్సిల్ చైర్మన్ హనుమాండ్ల రాజిరెడ్డి, గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అవార్డు అందజేశారు. బెస్ట్ ప్రెసిడెంట్‌గా గుండా రాజశేఖర్, సెక్రటరీగా వరాల జగన్, బెస్ట్ కోశాధికారిగా మహమ్మద్ అక్బర్‌లు అవార్డు అందుకున్నారు. లయన్స్ కోదండరాములు, మొర భద్రేశం, సభ్యులు పాల్గొన్నారు.

సీత్లా భవాని వేడుకలు



కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని మానేరు కట్ట కింద సీత్లా భవాని వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గిరిజనులు మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజన సంఘాల నాయకులు గుగులోతు రాజు నాయక్, భూక్య తిరుపతి నాయక్, గుగులోతు తిరుపతి నాయక్, మాలోతు రామచంద్ర నాయక్, గుగులోతు రవి నాయక్, గుగులోతు తిరుపతి, అనసూయ బాయి, బానోతు సేవియా నాయక్ తదితరులున్నారు.

బీసీలకు బీజేపీ చేసిందేమిటో చెప్పాలి



మాట్లాడుతున్న అంజనేయులుగౌడ్, నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: బీసీలకు బీజేపీ చేసిందేమిటో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి చెప్పాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు పునాది వేసింది బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అని పేర్కొన్నారు. అలాంటి కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత కృష్ణారెడ్డికి లేదన్నారు. బీసీలకు బీజేపీ, కాంగ్రెస్‌లు చేసిందేమిటో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రామిడి రాజిరెడ్డి, లింగంపల్లి బాబు, నూనె గోపాల్ రెడ్డి, ఎస్కే.సిరాజ్ హుస్సేన్, పోతుగంటి శ్రీనివాస్, మొలుగూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ చైర్మన్‌ను కలిసిన నాయకులు

అధికారిక పర్యటనలో భాగంగా మంగళవారం నగరానికి వచ్చిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఓబీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, నాయకులు రామిడి రాజిరెడ్డి, పోతుగంటి శ్రీను, లింగంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ రాజయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మోహన్

31న కులగణన యాత్ర ముగింపు సభ



మాట్లాడుతున్న రవీందర్, ప్రకాశ్, నాయకులు

కరీంనగర్: సమగ్ర కులగణన సాధన యాత్ర ముగింపు సభ ఈ నెల 31న కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఓ కల్యాణ మండపంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6 నెలల్లోపు సమగ్ర కులగణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. బీసీ కులగణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కామారెడ్డి నుంచి కరీంనగర్‌కు యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. ముగింపు సభకు బీసీ కుల సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పర్శరాంగౌడ్, సంపత్ గౌడ్, అంజయ్య, జీఎస్.ఆనంద్, శ్రీనివాస్, సురేందర్, బ్రహ్మాచారి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి



సమావేశమైన బీసీ నాయకులు

విద్యానగర్: ఆగస్టు 5, 6వ తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని, కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో పార్లమెంట్ ముట్టడి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ నిషేధించాలని, బీసీ క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని, బడ్జెట్‌లో బీసీలకు రూ.20 కోట్లు కేటాయించాలన్నారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, నగర అధ్యక్షుడు మియాపురం రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతునేస్తం సద్వినియోగం చేసుకోండి

- ఏడీఏ రణధీర్‌కుమార్



చామనపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న ఏడీఏ, ఏవో, ఏఈవోలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చామనపల్లి రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని ఏడీఏ రణధీర్‌కుమార్ ప్రారంభించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తలు పత్తి పంటలో చీడపీడల నియంత్రణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. పలువురు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏవో బి.సత్యం, ఏఈవోలు అనుజ్ఞ, పైడితల్లి, స్వర్ణలత, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి

వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఏఈవోలు క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేయాలని ఏడీఏ రణధీర్‌కుమార్ సూచించారు. మంగళవారం కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల, కమాన్‌పూర్, చెర్లభూత్కూర్ గ్రామాల్లోని పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, యాప్‌లో నమోదు చేశారు. ఆయన వెంట ఏఈవోలు స్వర్ణలత, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

'విద్యుత్' అక్రమాలపై విచారణ జరిపించాలి



ఫిర్యాదు కాపీ చూపుతున్న శ్రీధర్‌రాజు

కరీంనగర్: జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యుత్ బిల్లుల అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమిషనర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో మానకొండూర్ బీసీ సమీకృత వసతి గృహంలో దాదాపు రూ.40 లక్షలకు పైగా విద్యుత్ బిల్లుల పేరిట అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయినా, బాధ్యులపై ఎటువంటి చర్యలు లేవన్నారు. 2018 నుంచి 2022 వరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో కార్యాలయంలో పనిచేసే అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆయన తెలిపారు.

'డంప్‌యార్డుకు ఖర్చుపై విచారణ జరిపించండి'

కరీంనగర్ కార్పొరేషన్: నిబంధనలకు విరుద్ధంగా నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి డంప్‌యార్డుకు చేసిన ఖర్చుపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ అమెర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, వినతిపత్రం అందించారు. డంప్‌యార్డులో మంటలు చెలరేగితే సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీ ఆర్పాల్సి ఉందన్నారు. కానీ, నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకులను వినియోగించడంతోపాటు సాధారణ నిధులు ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, సంబంధిత బయోమైనింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఉద్యోగుల బదిలీ.. విధుల్లోకి కొత్తవారు

కరీంనగర్‌రూరల్: వివిధ ప్రభుత్వ శాఖల్లో నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా కరీంనగర్ మండలంలో పని చేస్తున్న ఐదుగురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. మంగళవారం తాహెర్‌కొండాపూర్ కార్యదర్శి మమత స్థానంలో ప్రవళిక, దుబ్బపల్లిలో సరిత స్థానంలో సుజాత, చేగుర్తిలో రాజు స్థానంలో రాజమల్లయ్య, మందులపల్లిలో కిరణ్‌కుమార్ స్థానంలో కిశోర్ విధుల్లో చేరారు. చామనపల్లి కార్యదర్శి ప్రభాకర్ స్థానంలో బదిలీపై వచ్చిన మహేందర్‌రావు ఇంకా విధుల్లో చేరలేదు. ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఆరిఫ్ స్థానంలో మమత, బిల్ కలెక్టర్ రేణుక స్థానంలో శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు.

పశుసంవర్ధక శాఖలో...

బొమ్మకల్‌లో వెటర్నరీ అసిస్టెంట్ లచ్చయ్య స్థానంలో విజయలక్ష్మి, చేగుర్తిలో జేవీవో సంధ్యారాణి స్థానంలో అర్చన, మొగ్ధుంపూర్ జేవీవో సమ్మయ్య స్థానంలో ఆరిఫ్ అహ్మద్, నగునూరులో జేవీవో రాజు స్థానంలో సమ్మయ్య బాధ్యతలు తీసుకున్నారు. ఆఫీస్ స్టాఫ్ విభాగంలో చేగుర్తిలో అంజయ్య స్థానంలో అర్చన, ఇరుకుల్లలో పర్శరాములు స్థానంలో అనిత విధుల్లో చేరారు.

'పారమిత'లో కెరీర్ డే



కరీంనగర్: పట్టణంలోని పారమిత ఉన్నత పాఠశాలలో మంగళవారం కెరీర్ డే సెలెబ్రేషన్స్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు. మూడో తరగతి విద్యార్థులకు సోషల్ సబ్జెక్ట్‌లోని పాఠ్యాంశంలో భాగంగా వివిధ కుల వృత్తులు కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, స్వర్ణకార, పద్మశాలీ, ప్రొఫెషనల్ వృత్తులు వైద్యం, ఇంజినీరింగ్, వర్తక వ్యాపారం అనే అంశాలపై ఆయా రంగాల్లో నిష్ణాతులైన 32 మంది ప్రముఖులచే అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను పారమిత పాఠశాలల అధినేత ఈ.ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, టి.ఎస్.వి.రమణ, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- జనాకర్షక బడ్జెట్ అంటున్న బీజేపీ
- పెదవి విరుస్తున్న విపక్షాలు

కరీంనగర్/కరీంనగర్ టౌన్/విద్యానగర్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ జనాకర్షక బడ్జెట్ అంటోంది. విపక్షాలు మాత్రం పెదవి విరుస్తున్నాయి. బహుళ జాతి సంస్థలకు, సంపన్న వర్గాలకు కొమ్ముకాస్తూ పేద ప్రజల నడ్డివిరిచేలా ఉందని, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదని అంటున్నాయి.

తెలంగాణకు మొండిచేయి



కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ తెలంగాణకు మొండిచేయి చూపింది. కేంద్రం అన్యాయం చేస్తుంటే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఉత్సవ విగ్రహాల మాదిరిగా ఉండిపోయారే తప్ప ఏమీ మాట్లాడకపోవడం సిగ్గుచేటు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు.
– మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి

నిరాశపరిచింది



బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచింది. విదేశీ పెట్టుబడుదారులకు, కార్పొరేట్లను సంతృప్తిపరిచేలా ఉంది. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల ఊసే లేదు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకు మొండి చేయి చూపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ జిల్లాకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారు.
– మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

'ఉపాధి'కి అరకొర నిధులు



ఉపాధి హామీ పథకానికి అరకొరగా రూ.88 వేల కోట్లు కేటాయించారు. దేశంలో 14 కోట్ల మంది ఉపాధిహామీ జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో బడ్జెట్ కేటాయింపులు రెట్టింపు స్థాయిలో ఉండాలి తప్ప నామమాత్రంగా ఇస్తే పని దొరకదు.
– కొయ్యడ సృజన్‌కుమార్, బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి

విద్యారంగానికి తగ్గించారు



బడ్జెట్ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసింది. విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ ఉన్నా గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి రూ.4 వేల కోట్లు తగ్గించారు. విభజన చట్టం ప్రకారం కరీంనగర్‌లో ఐఐఐటీ ఏర్పాటు చేయాలని ఉన్నా మంజూరు చేయలేదు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంలో విఫలమయ్యారు.
– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

స్కాలర్‌షిప్‌లకు పెంచలేదు



ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.6,660 కోట్లు కేటాయించారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. కానీ, ఆ దిశగా బడ్జెట్‌లో నిధులు పెంచలేదు. ఇది విద్యార్థులను చదువులకు దూరం చేయడమే. మధ్యాహ్న భోజన పథకానికి కూడా కుదించారు.
– తిప్పారపు సురేశ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

ఉద్యోగులకు లాభం లేదు



బడ్జెట్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్‌కు సంబంధించి పన్ను రాయితీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఉద్యోగులకు కనీసం రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించకపోవడం, పొదుపు మొత్తాలను కేవలం రూ.1.5 లక్షలుగా ఉంచడంతో వారికి ఎలాంటి లాభం లేదు.
– జాలి మహేందర్‌రెడ్డి, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్

యూజీసీకి భారీగా కోత



యూజీసీకి నిధుల కేటాయింపులో భారీ కోత పెట్టారు. విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య ఎలా అందిస్తారో చెప్పాలి. రాష్ట్రానికి ట్రిపుల్ఐటీ, నవోదయ పాఠశాలలను ప్రకటించలేదు. ఈ బడ్జెట్‌ను సవరించాలి.
– ఎస్.రజినీకాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వేతన జీవులకు ఊరట



వేతన జీవులకు ఊరట కలిగించే బడ్జెట్. న్యూ రెజ్యూమ్‌లో స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పెంచడం వల్ల ఉద్యోగులకు పన్ను భారం కొంత తగ్గుతుంది. ఫ్యామిలీ పెన్షన్ స్కీంలో రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడం శుభపరిణామం. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేశారు. హర్షణీయం.
– కె.వెంకటేశ్వర్లు, అడ్వకేట్

8 మంది ఎంపీలున్నా ఏమీ లేదు



రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు సహా 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు. పురుగు మందులపై కస్టమ్ డ్యూటీ పెంచి, ఎరువుల ధరలు పెరిగేలా చేశారు. ఎన్డీఏ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు, ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే కేటాయింపులు చేశారు.
– గడ్డం విలాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి

టీడీపీ, జేడీయూ కోసమే..



ఈ బడ్జెట్ టీడీపీ, జేడీయూల కోసమే ప్రవేశపెట్టినట్లు ఉంది. ఏపీ, బిహార్‌లకు ఆర్థికసాయం ప్రకటించిన కేంద్రం తెలంగాణకు మాత్రం అన్యాయం చేసింది. మిత్రపక్షాలను బుజ్జగించేందుకు ఇతర రాష్ట్రాలను పక్కన పెట్టారు.
– పదాల రవీందర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



కేంద్ర బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. వ్యవసాయ రంగానికి రూ.1.53 లక్షల కోట్లు, ముద్ర లోన్ రూ.20 లక్షలకు పెంపు, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్ల కేటాయింపు వంటివి పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ఉపయోగకరం.
– పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు

అన్ని రంగాలు ప్రభావితం



వికసిత భారత్ లక్ష్యంగా అన్ని రంగాలను ప్రభావితం చేస్తూ నిధులు కేటాయించడం హర్షణీయం. ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక రంగ వ్యక్తులకు వెసులుబాటు కలిగిస్తూ ఆదాయ పన్ను స్లాబ్ రేట్లను తగ్గించారు.
– వేములవాడ ద్రోణాచారి, ఇన్‌కం ట్యాక్స్ ప్రాక్టీషనర్, రాఘవేంద్ర నగర్, కరీంనగర్

కార్పొరేట్ సంస్థలకు లబ్ధి



కార్పొరేట్ కంపెనీలు, బహుళ జాతి సంస్థలకు లబ్ధి చేకూర్చే బడ్జెట్ ఇది. పేద ప్రజల ఆశలను ఆవిరి చేశారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ ఇచ్చిన హామీలకు విరుద్ధంగా కనిపిస్తోంది. – సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు

మత్తు పదార్థాలపై అవగాహన



సప్తగిరికాలనీ: స్థానిక ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ చాంద్ అధ్యక్షతన జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్ మాట్లాడారు. మత్తు పదార్థాలు శరీరాన్ని చిత్తు చేస్తాయని, మద్యంతో కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి గౌడ్ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను పాట రూపంలో వివరించడం ఆలోచింపజేసింది. టీచర్లు జగదీశ్వర్‌రావు, వసుంధర, ప్రవీణ్, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, నటరాజు, సునంద, రజిత, దివాకర్, ప్రకాశ్, రఘు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ

- 30 వరకు రైతువేదికల్లో అవకాశం
- రిజిస్టర్‌లో నమోదు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఏఈవో అనుజ్ఞ

కరీంనగర్‌రూరల్: రుణమాఫీ పథకంలో లబ్ధి పొందని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించే బాధ్యతను ప్రభుత్వం ఏఈవోలకు అప్పగించింది. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల పంట రుణమాఫీలో భాగంగా ఈ నెల 18న మొదటి విడతలో రూ.లక్ష మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. కరీంనగర్ మండలంలో మొత్తం 1,975 మంది రైతులకు రూ.8.72 కోట్లు మాఫీ అయ్యాయి. అయితే, ఈ జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో పలువురు అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. రుణమాఫీలో నెలకొన్న సాంకేతిక సమస్యలను గుర్తించిన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సంబంధిత ఫిర్యాదులను ఏఈవోలు తీసుకోవాలని ఆదేశించింది. మంగళవారం నుంచి కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, నగునూరు, మొగ్ధుంపూర్, చామనపల్లి రైతు వేదికల్లో ఏఈవోలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రుణమాఫీ పోర్టల్‌లో రైతు ఆధార్ నంబర్ నమోదు చేసి, రుణమాఫీ కాకపోవడానికి కారణాలను తనిఖీ చేస్తున్నారు. అయితే, ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసే అవకాశం సర్కారు కల్పించకపోవడంతో రైతు పేరు, ఆధార్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలతోపాటు కారణాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. చామనపల్లి రైతువేదికలో 55 మంది అన్నదాతల రుణమాఫీ వివరాలను ఏఈవో అనుజ్ఞ పరిశీలించారు. వీరిలో నలుగురికి సంబంధించి పోర్టల్‌లో నో డేటా రావడంతో వివరాలను రిజిస్టర్‌లో రాశారు. నాలుగు క్లస్టర్ల పరిధిలో 9 మంది ఫిర్యాదులను నమోదు చేసినట్లు ఏవో సత్యం తెలిపారు. ఈ నెల 30 వరకు రుణమాఫీపై ఫిర్యాదు చేసే అవకాశముందని, ఆయా రైతు వేదికల్లోని ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.